క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



కేఎల్లార్‌తో జల్‌పల్లి నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో నెల కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్‌ను కోరారు. ఈ మేరకు పార్టీ మున్సిపాలిటీ కో–ఆర్డినేటర్లు షేక్ జహంగీర్, తయ్యబ్ దయానీ బృందం ఆయనకు సమస్యను విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముఖ్యంగా జల్‌పల్లి గ్రామం, శ్రీరాం కాలనీలో సీసీరోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలు తిష్ట వేశాయన్నారు. మున్సిపాలిటీలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నందున, ఈ మున్సిపాలిటీలో కూడా సమస్యలు పరిష్కారం అయ్యేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ 17వ వార్డు అధ్యక్షుడు చింతకింది నవీన్‌గౌడ్, నాయకులు షేక్ జహీరుద్దీన్, సయ్యద్ అబ్దుల్ నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పదవులకు దరఖాస్తు చేసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన బ్లాక్ డివిజన్, మండల పార్టీ పదవులను ఆశించేవారు ఈ నెల 17లోపు దరఖాస్తు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ సూచించారు. నియోజకవర్గంలోని ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్లు, బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లు, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలు, కందుకూరు, మహేశ్వరం మండల అధ్యక్షులతో పాటు, బ్లాక్‌స్థాయి పదవులను భర్తీ చేస్తామన్నారు. ఈ పదవులను ఆశించే నాయకులు దరఖాస్తు ఫారాలను పూర్తిచేసి, తుక్కుగూడ మున్సిపాలిటీలోని పార్టీ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఉచిత యోగా తరగతులకు విశేష స్పందన



యోగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

హుడాకాంప్లెక్స్: బాలల వ్యక్తిత్వ వికాస యోగా శిక్షణ అనేది వారి మానసిక దృఢత్వానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రముఖ యోగా గురువు ఇస్మాయిల్ అన్నారు. సరూర్‌నగర్ డివిజన్ హుడాకాంప్లెక్స్‌లో జరుగుతున్న ఉచిత యోగా శిక్షణ తరగతులకు విశేష స్పందన లభించింది. హుడాకాంప్లెక్స్ పరిసర కాలనీల్లో ఉన్న విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. చైతన్య ప్రశాంతి యోగా సాధన చేయించి సదాచారం బోధించారని గురూజీ తెలిపారు. వ్యక్తిగత జీవితంలో ఆహారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌ను అరికట్టాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న ప్రభాకర్

కందుకూరు: అక్రమంగా జరుగుతున్న మైనింగ్‌ను అరికట్టి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలని కోరుతూ మండల పరిధిలోని కటికపల్లికి చెందిన ఎక్కల ప్రభాకర్ బుధవారం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా మైనింగ్ చేస్తున్న కొన్ని కంపెనీలపై ఇటీవల ప్రభుత్వం అపరాధ రుసుం విధించిందన్నారు. ఇంకా చాటు మాటుగా మైనింగ్ చేస్తూ వేల కోట్ల విలువైన ఖనిజ సంపదను దోసుకుంటున్న అక్రమార్కులపై నిఘాపెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయం పెరగడానికి దోహదపడుతుందని, ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాన్స్‌జెండర్స్ కోసం జిల్లాకో క్లినిక్

చాదర్‌ఘాట్: ట్రాన్స్‌జెండర్ల కోసం జిల్లాకో క్లినిక్‌ను ఏర్పాటు చేశామని డైరెక్టర్ బి.శైలజ తెలిపారు. బుధవారం ఆమె మలక్‌పేటలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి జిల్లా ఆసుపత్రిలో క్లినిక్‌లను ఏర్పాటు చేశామని అవసరాన్ని బట్టి వారానికి రెండు మూడు రోజులు అందుబాటులోఉంటుందన్నారు. ట్రాన్స్‌జెండర్స్ అనారోగ్యానికి గురైతే ధైర్యంగా వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు.

అవుట్‌లెట్ లేక.. సమస్య తీరక



ఓ కాలనీలో మురుగును తోడేస్తున్న గల్ఫర్ యంత్రం

- కార్పొరేషన్ ప్రజలు సతమతం
- వేధిస్తున్న గల్ఫర్ మిషన్ల కొరత
- 370 కాలనీలకు ఒక్కటే యంత్రం
- నిండిపోతున్న డ్రైనేజీ సంపులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కార్పొరేషన్‌లో డ్రైనేజీ సమస్య తీవ్రమైంది. రాష్ట్రంలోనే ఆదాయంలో రెండో స్థానంలో ఉన్నప్పటికీ.. మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనలో వెనుబడింది. ఇప్పటి వరకు డ్రైనేజీ పారేందుకు అవుట్‌లెట్ లేవంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కనీసం ఆ సంపులను తోడేందుకు సరిపడా గల్ఫర్ యంత్రాలు లేక, మురుగుతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

బడంగ్‌పేట: బడంగ్‌పేట మున్సిపాలిటీ కార్పొరేషన్‌లో సుమారు రెండు లక్షల జనాభ, 370కి పైగా కాలనీలు ఉన్నాయి. ఇందులో 20కి పైగా కాలనీలకు ఇప్పటి వరకు డ్రైనేజీ పారేందుకు అవుట్‌లెట్ లేదు. దీని కారణంగా ఆయా కాలనీల్లో వ్యక్తిగత సంపుల నిండా మురుగు పేరుకుపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీటిని శుభ్రం చేసే గల్ఫర్ యంత్రాల కొరత నేపథ్యంలో బాధిత కాలనీల వాసులు కార్పొరేషన్ కార్యాలయానికి క్యూకడుతున్నారు. సమస్య తీర్చాలని విన్నవిస్తున్నారు. రాజకీయ నాయకుల చేత ఫోన్లు చేయించి కొందరు సమస్యను తీర్చుకుంటుండగా.. మిగతా వారు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

రోజుకు రూ.70 వేలతో..

ఆదాయంలో కార్పొరేషన్ రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉన్నప్పటికీ.. ఒకే ఒక్క చిన్న గల్ఫర్ మిషన్‌తో కాలం వెళ్లదీస్తోంది. దీంతో సమస్య తీవ్రమవుతోంది. ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో.. కార్పొరేషన్ అధికారులు ప్రైవేట్ గల్ఫర్ మిషన్‌లను ఆశ్రయిస్తున్నారు. రోజుకు రూ.60 వేల నుంచి 70 వరకు వెచ్చిస్తూ సమస్యను పరిష్కరిస్తున్నారు. జనాభాకు అనుగుణంగా అత్యవసరంగా పెద్ద గల్ఫర్ మిషన్‌తో పాటు బాబ్‌కోట్, డివిజన్‌కు ఒకటి చొప్పున చెత్త సేకరణ ఆటోలు, డ్రైనేజీ, వర్షపు నీటి వాటర్‌ను లిఫ్ట్ చేయడానికి పెద్ద మోటార్లు అవసరం ఉన్నప్పటికీ.. అధికారులు పట్టించుకోవడం లేదని ప్రాంత వాసులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్య తీవ్రతను గుర్తించి, తగిన యంత్రాలు, సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

రోజుకు రెండు కాలనీలు..



ఉన్న ఒక్క చిన్న గల్ఫర్ మిషన్ సరిపోవడంలేదు. అవుట్‌లెట్ లేని కాలనీల నుంచి ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. ఉన్న మిషన్‌తో రోజుకు రెండు కాలనీల సమస్య తీర్చగలుతున్నాం. ప్రైవేట్ గల్ఫర్ తెప్పించుకుని సమస్యల పరిష్కారానికి యత్నిస్తున్నాం. సమస్య తీవ్రత ఉన్న ప్రాంతానికి ఉన్న యంత్రాన్ని పంపిస్తున్నాం.

– వి.యాదగిరి, శానిటరి ఇన్‌స్పెక్టర్

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

తుక్కుగూడ: కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి.దత్తునాయక్ అన్నారు. బుధవారం తుక్కుగూడ మున్సిపాలిటీలో కార్మికులతో కలిసి సమ్మె సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికులకు హక్కులు లేకుండా చేసిందన్నారు. కోడ్‌లను నిరసిస్తూ ఈ నెల 20న దేశ వ్యాప్తంగా సమ్మె చేపడుతున్నామని, కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాను, రాములు, నర్సింహ, సురేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆంజనేయస్వామి మహోత్సవాలు షురూ



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి సాహెబ్‌నగర్‌లోని త్రినేత్ర ఆంజనేయస్వామి దేవస్థానంలో మూడురోజుల పాటు జరగనున్న మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీఎన్ రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మురళీకృష్ణ, నాయకులు సుమన్‌గౌడ్, సతీష్‌గౌడ్, చంద్రకాంత్ గౌడ్, సుధాకర్ యాదవ్, వెంకటేష్‌యాదవ్, విష్ణువర్ధన్‌రావు, మహేష్, నాగరాజుగౌడ్, రాజు గౌడ్, శివశంకర్‌గౌడ్, సిద్దేశ్వర్, మహేందర్‌రెడ్డి, విజయ్, సురేష్‌కుమార్, నివాస్, బాలకృష్ణ, కిరణ్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి దేవాలయ ప్రాంగణంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం 9.14లకు విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన అనంతరం దృష్టికుంభం, బలిహరణం, పూర్ణాహుతి, యజ్ఞభస్మతిలకధారణ కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం అన్నప్రసాద వితరణ సాయంత్రం 6.30లకు సర్వనామ సంకీర్తన భజన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్, నాయకులు యాదగిరి, హనుమంతరావు, కేశవులు, రమణ మూర్తి అనసూయ తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు



పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు



రథోత్సవంలో.. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని శ్రీమత్స్యావతార వేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పదిరోజుల పాటు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించామని, స్వామివారి తిరు కల్యాణోత్సవం, నిత్యహోమం, పుష్పయాగం, రథోత్సవంతో పాటు ప్రత్యేక పూజలు చేశామన్నారు. ఆలయ ఫౌండర్ రాజాసంజయ్, గోపాల్ సైంచర్, మాజీ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, మాజీ ధర్మకర్తలు యాదగిరి ముదిరాజ్, జ్ఞానేశ్వరచారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మహేశ్వరం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశం మందిరంలో గురువారం మండలంలోని 128 లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వరరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పి.సబితారెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని అధికారులు కూల్చివేశారు. గత నెల రోజులుగా లక్ష్మీనగర్ కాలనీ చౌరస్తాలో జీ ప్లస్ టు నిర్మాణానికి అనుమతులు పొందిన బిల్డర్ సదరు స్థలంలో భారీ సెల్లార్ తవ్వారు. ఈ విషయమై సమీప భవంతుల యజమానులు, కాలనీవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్ పలుమార్లు జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు బిల్డర్‌కు రెండుసార్లు నోటీసులు ఇచ్చారు. గత రెండు రోజులుగా మళ్లీ అక్కడ నిర్మాణానికి ప్రయత్నించడంతో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు స్లాబ్ వేయడానికి ఏర్పాటు చేసుకున్న సామగ్రిని తొలగించారు.

అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలు, బస్తీల్లోని అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి తెలిపారు. బుధవారం న్యూసైదాబద్ కాలనీలో రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారి నిర్మాణ పనులను ఆమె కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. సైదాబాద్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ల పనులు కొనసాగుతున్నాయని ఆయా ప్రాంతాల్లో పైపులైన్‌ల పనులు పూర్తయిన తర్వాత రహదారులను నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బసవేశ్వరరావు, మదన్‌మోహన్, విష్ణువర్ధన్‌రావు, హనుమంతరావు, దీపక్, రజిత, అనిత, లక్ష్మి, మాధురి, విజయలక్ష్మి, అరుణ, రూప పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు పోరాటం



వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నాగోలు: చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు బీసీల యుద్ధం కొనసాగుతుందని మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర కోర్‌కమిటీ సభ్యులు పెద్దవూర బ్రహ్మయ్య అన్నారు. మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల పై త్వరలో జరిగే సదస్సుల కరపత్రాలను బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని మండల కేంద్రల్లో తిరుగుతూ బీసీలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. బీసీలకు రాజ్యాధికారం రావాలంటే అసెంబ్లీ పార్లమెంట్‌లో 18 నుంచి 20 కులాలు నాయకులు అసెంబ్లీ పార్లమెంట్ మెట్లు ఎకితేగాని రాజ్యాధికారం వచ్చే అవకాశం లేదు కాబట్టి మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపకులు కటకం నర్సింగ్ రావు నడుం బిగించి బీసీలను చైతన్య పరుస్తూ బీసీల అభ్యున్నతికి పోరాటం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కుంచాల బ్రహ్మయ్య, మద్దూరు మహేష్, కానుగుల తిరుపతి, మల్లేష్ గౌడ్, రామస్వామి గౌడ్, భూపేష్ చారి, సునీల్ గౌడ్, నరసింహ గౌడ్,శివ అశోక్ పాల్గొన్నారు.

బెట్టింగ్‌లకు అలవాటు పడుతున్న యువత, విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఈజీ మనీ అత్యాశతో అప్పులపాలై కొందరు ఆత్మహత్యలు చేసుకోవడంతో.. వారి కుటుంబ సభ్యులు రోడ్డున పడే దుస్థితి నెలకొంది. బెట్టింగ్ అంటే చాలా మందకి సరదాగానే ఉంటుంది. రూపాయికి పది రూపాయలు వస్తాయన్న భ్రమలో తెలియాడుతుంటారు. బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పోయిన కొద్ది వస్తాయన్న ఆశతో మొత్తం పోగొట్టుకున్నారు.

–నాగోలు

బెట్టింగ్ ఉచ్చు..

జీవితానికి చిచ్చు

ఆర్థికంగా నష్టపోతున్న యువత, విద్యార్థులు

అప్పుల బాధతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న వైనం | అవగాహన కల్పించాలంటున్న తల్లిదండ్రులు | కుటుంబ సభ్యులు నిఘా ఉంచాలంటున్న పోలీసులు



బెట్టింగ్‌ల కోసం యాప్‌లలో రుణాలు..

ఎల్బీనగర్ జోన్ పరిధిలోని బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పెట్టి పోగొట్టుకున్నావారు అనేక మంది ఉన్నారు. బెట్టింగ్ యాప్‌లో మొత్తం పోగొట్టుకుంటున్నా వారు.. ఆస్తులు అమ్ముకుంటూ కొందరు అప్పుల పాలవుతే.. మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పోగొట్టుకున్న అమాయకులు ఎంతో మంది ఇప్పుడు పోలీస్ స్టేషన్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లను ప్రముఖులు గతంలో తరచూ ప్రమోట్ చేయడంతో చాలామంది వాటిని అలవాటు చేసుకున్నారు. ఆన్‌లైన్ ఆడటం ద్వారా డబ్బులు ఎక్కువ సంపాదించొచ్చనే ఆలోచన ఉండటంతో తెలిసి తెలియని వయసులో ఎంతో మది సరదాగా ఆటాలను ప్రారంభిస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా ఆడుతూ రూ. లక్షల్లో పోగొట్టుకొని ప్రాణాలు తీసుకున్న సంఘటనలు అనేకం. వీటికి తేలికగా రుణాలు ఇచ్చే యాప్‌లలో రుణాలు తీసుకుంటున్నారు. వాటిని కట్టలేక ఇంట్లో చెప్పలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇలా ఎల్బీనగర్ జోన్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి నిత్యం ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పాగొట్టుకున్న వారు అనేక మంది పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. రాచకొండ సైబర్ క్రైమ్ ఠాణాకు సైతం నిత్యం ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రభుత్వం అనేక ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను మూసి వేసిన కొత్త రూపంలో యాప్‌లో అందుబాటులో వస్తున్నాయి.

కేసులు నమోదు చేస్తున్నాం:

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలోని అనేక కేసులు నమోదువుతున్నాయి. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడే వారి పట్ల కుటుంబ సభ్యులు నిఘా పెట్టాని

– ప్రవీణ్‌కుమార్, ఎల్బీనగర్ డీసీపీ

మచ్చుకుకొన్ని..

- ఎల్బీనగర్ పరిధిలో బండ్లగూడలో నివాసం ఉండే యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు అలవాటు పడ్డాడు. దీంతో తన స్నేహితుల వద్ద పెద్ద ఎత్తున అప్పులు చేశాడు. ఎవరూ డబ్బులు ఇవ్వక పోవడంతో ఇతరులను బెదిరించి డబ్బులు తీసుకుని ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటు పడ్డాడు. ఇంట్లో నుంచి సైతం డబ్బులుపోవడంతో యువకుడు నిత్యం ఫోన్‌లో ఉండడం గమనించిన వారి కుటుంబ సభ్యులు అతని స్నేహితుల ద్వారా



విషయం తెలుసుకున్నారు. అప్పటికే యువకుడు రూ. లక్షల్లో అప్పులు చేసి ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పోగొట్టుకున్నాడు. విషయం తెలిసిన పోలీస్ స్టేషన్ పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.
- నాగోలు పరిధిలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు అలవాటు పడి ఇంట్లో ఉన్న డబ్బులు, భార్య బంగారు ఆభరణాలు, కారు ఇతర ప్రాంతాల్లో కుదవపెట్టి రూ.లక్షల్లో డబ్బులు పోగొట్టుకున్నాడు. దాదాపుగా రూ. 20 లక్షలు ఆన్‌లైన్‌లో పోగొట్టుకున్నట్లు సమాచారం. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు బంగారం , కారు గురించి ఆరా తీయగా అసలు విషయం బయట పడింది.

ఘనంగా బ్రహ్మోత్సవం



పూజల్లో పాల్గొన్న సామ రంగారెడ్డి, పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ వినాయక్ నగర్‌లో శ్రీ బంగారు గవ్వల రేణుకా ఎల్లమ్మ తల్లి 15వ వార్షిక (బ్రహ్మోత్సవ కల్యాణ మహోత్సవం) బుధవారం ఘనంగా నిర్వహించారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్ కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ పూజల్లో చైతన్యపురి కార్పొరేటర్ నర్సింహగుప్తా, బీఎస్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్‌గౌడ్ పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ కట్ట వెంకటేశం స్వామి ముదిరాజు, శివప్రకాష్, గణేష్‌గౌడ్, నిరంజన్, సాయినాథ్ గౌడ్, తోట మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

22న జయంతి మహోత్సవాలు

నాగోలు: నాగోలు డివిజన్ పరిధి బండ్లగూడ శ్రీనివాస కాలనీలోనిఅభయాంజనేయ స్వామి దేవాలయంలో ఈ నెల 22న సీతారామ చంద్రస్వామి ఉత్సవ మూర్తి సహిత శ్రీహనుమాన్ త్రయోదశ (13)వ జయంతి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు మోటుపల్లి లక్ష్మీ రామాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం సుప్రభాతం, నిత్య ఆరాధన, మంచామృత, సింధూరాభిషేకం, అలంకరణ, సహస్ర నామ ఆకుపూజ, శ్రీ హనుమాన్ చాలీషా 11 సార్లు పారాయణం, తీర్థ ప్రసాదగోష్టి, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.